# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## ఆధునిక సమాజానికి దిక్సూచి సంస్కృతం

### ఎన్ఎస్‌యులో ప్రారంభమైన సంస్కృత వారోత్సవాలు



తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త
ఆధునిక సమాజానికి సంస్కృతం దిక్సూచి అని అక్షర పురుషోత్తమ ధామం అధ్యక్షులు స్వామిభద్రేశ దాస్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో సంస్కృత వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు ఆయన వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తితో కలసి ప్రారంభించి ప్రసంగించారు. సంస్కృతం భారతీయ జ్ఞానసంపదకు మూలమన్నారు. సంస్కృతాన్ని ఆధునిక సమాజానికి మరింత చేరువచేసేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సంస్కృతంతోనే సమాజంలో ఉత్తమ సంస్కారులుగా గుర్తింపు పొందుతారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రపతి సమ్మాన గ్రహీత, ప్రొఫెసర్. కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ వెంకటనారాయణ రావు, డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, డాక్టర్ భారతి భూషణరథ్, డాక్టర్ ప్రదీప్ కుమార్ బాగ్, డాక్టర్ ఉదయాన హెగ్డే అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చింతల వంక రిజర్వ్ ఫారెస్ట్ పరిసర ప్రాంతాల్లో

## ఏనుగుల గుంపు సంచారం



కల్లూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త
చింతల వంక రిజర్వ్ ఫారెస్టు పరిసర ప్రాంతాల్లో ఏనుగులు గుంపు సంచరిస్తున్నాయి. కోటపల్లె, దేవళంపేట, గండివారిపల్లి, మాదిగపల్లి, వంకాయల వారిపల్లి, కమ్మపల్లి, గంటావారిపల్లి, దిగువ మూర్తివారి పల్లి గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవి శాఖ అధికారులు సూచించారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల్లో రాత్రివేళ బస చేయకూడదన్నారు. తెల్లటి దుస్తులు ధరించి అటవీ ప్రాంతాల చుట్టూ తిరగకూడదన్నారు. రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏనుగుల చలనం గురించి సమాచారం తెలుసుకున్న వారు వెంటనే 82477 45101, 7989577256, 9618918081 నెంబర్లకు సంప్రదించాలని అన్నారు.

### గ్రామాల్లో త్వరితంగా

## మౌళిక వసతులు పూర్తి

### - కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు.

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:
గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన పనులు త్వరితంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జడ్పీ సమావేశ భవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలో 15వ ఆర్థిక సంఘ నిధుల ద్వారా వివిధ మండలాలకు వచ్చిన నిధులను మండలాల్లో ఏ విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు అనే విషయంపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు, జడ్పీ సాధారణ నిధుల కింద గ్రామాల్లో మంచినీటి సరఫరా పనులను సకాలంలో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ కాలనీల్లోని లేఅవుట్లలో సమస్యలు వున్నట్లైతే ఎంపిడిఓలు తహసిల్దార్లను సమన్వయం చేసుకుని వాటిని త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎంపిడిఓలు మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసి జడ్పీ సిఇఒకు సమర్పించాలన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ నిర్మాణాల్లో మౌళిక వసతులు కచ్చితంగా వుండాలని, అందుకు సంబంధించిన అధికారులను పనులను నాణ్యతతో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఏదైనా పనులు జరుగకపోతే వాటి వివరాలను జడ్పీ సిఇఒకు నివేదించాలన్నారు. మరో నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన డేటా క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను లేఖరూపంలో జడ్పీ సిఇఒకు సమర్పించాలన్నారు. జిల్లాలో ఏడు నియోజకవరాలకు సంబంధించి పంచాయతీరాజ్ ద్వారా చేపట్టిన పనుల్లో 146 కోట్ల రూపాయల విలువైన 214 పనులు, ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా మంచినీటి సరఫరాకు సంబంధించి 93.17 కోట్ల రూపాయల విలువైన 257 పనులు పెండింగ్‌లో వున్నాయని, ఈ పనులను నిర్దేశించిన కాలంలోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఒ రవికుమార్‌నాయుడు, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## సర్వదోష పరిహారోత్సవంలో పవిత్రమాలల సమర్పణ





తిరుమల, ఆగస్ట్ 6 ప్రభాతవార్త ప్రతినిధి:
పలు రకాల పూజలు, కైంకర్యాలు సేవలతో ఆలయంలో తెలిసీ తెలియక జరిగే పరిహారాల దోషనివారణకు జరిగే పవిత్రోత్సవాల్లో రెండోరోజు పవిత్రమాలలను సమర్పించారు. ఆనందనిలయం విమానవేంకటేశ్వరునికి. ధ్వజస్తంభానికి, ఉపఆలయాల్లో స్వామి వార్లకు, ఉత్సవమూర్తులకు, బేడి ఆంజనేయస్వామికి పవిత్రమాలలు సమర్పించారు. సంపంగిప్రాకారంలోని కల్యాణోత్సవ మండపం యాగశాలలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప స్వామి ఉత్సవమూర్తులకు హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యంగారు, టిటిడి ఈఓ జె. శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.

## కమనీయం ద్రౌపది కళ్యాణం

### పేటలో పెళ్లి సందడి





కళ్యాణానికి ముస్తాబైన స్వామి అమ్మవార్లు, కళ్యాణానికి హాజరైన భక్తులు

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి 155వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కళ్యాణోత్సవం నిర్వహించారు. ద్రౌపదీ దేవి కళ్యాణంకమనీయం అంటూ నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి పట్టణంలోనూ, పాపానాయుడుపేటలో ధర్మరాజుల స్వామికి ప్రత్యేక ఆలయాలున్నాయి. పేటలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందర్భంగా తీర్చి దిద్దారు. కళ్యాణానికి ఆలయాన్ని నిత్యకళ్యాణం పచ్చతోరణంలా తీర్చి దిద్దారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ కళ్యాణం తంతును నిర్వహించారు. ఉభయదారులు మేళ తాళాలతో కళ్యాణానికి తరలి రావటం ప్రధానం కార్యక్రమాలు నిర్వహించారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలు మోగుతుండగా వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగాకళ్యాణాన్ని సంప్రదాయ పద్ధతిగా నిర్వహించారు. వందలాది మంధి భక్తులు హాజరుకాగా కళ్యాణం మాంగల్య ధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు. ఇక్కడ ప్రధాన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్జున తపస్సు, ఆదివారం అగ్నిగుండం నిర్వహించనున్నారు. ఇందుకు కమిటి నిర్వాహాకులు సన్నాహాలు చేస్తున్నారు. కళ్యాణం తరువాత స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

### విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో..

## పాడి పశువులు మృతి



గంగవరం, ఆగస్టు 6, ప్రభాతవార్త :
విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ. 2 లక్షలు విలువైన రెండు పాడి పశువులు విగత జీవులుగా మారిన సంఘటన ఇది. వివరాల్లోకి.. మండలంలోని మేలుమాయి గ్రామానికి చెందిన వెంకటరమణ, నేత్ర దంపతులు పాడి ఆవుల వలన జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పాడి పశువులను మేత కొరకు నేత్ర తన పొలం వద్దకు తోలుకుని వెళ్తుండగా గ్రామ సమీపంలోనే రహదారి పక్కనే విద్యుత్ స్థంబానికి విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసిన బుడ్డీ ట్రాన్స్ ఫార్మర్ ద్వారా విద్యుత్ సరపరా కావడంతో మూగజీవులు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. మహిళ పాడి రైతు నేత్ర(37) కూడా విద్యుత్ షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే కుప్పకూలి పడిపోయింది. స్థానికులు ఆమెను వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన కుటుంబానికి పాడి పశువులే జీవనధారం అంటూ అలాంటి పాడి పశువులు విగత జీవులుగా మారడంతో తమ బ్రతుకుదెరువు ఎలా సాగించాలని పాడి రైతులు బోరున విలపించారు. మూగజీవులు విగత జీవులుగా మారడానికి విద్యుత్ అధికారులు, సెల్ టవర్ నిర్వాహకుల నిర్లక్ష్యమేనని, వారిపై చర్యలు తీసుకోసువాలంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బాధిత పాడిరైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యూరియా కోసం రైతుల అగచాట్లు

### -వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు తీరిన రైతులు



యూరియా కోసం బారులుతీరిన రైతుల దృశ్యం

*పలమనేరు, ఆగస్టు 6, ప్రభాతవార్త:*
*పలమనేరు మండలంలో యూరియా కోసం రైతులు అగచాట్లు పడుతున్నారు. రోజుల తరబడి రైతులు వ్యవసాయ కార్యాలయం, రైతుల భరోసా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా ఫలితం లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గత రెండు నెలలుగా రైతులకు యూరియా అందిస్తుంది. అయితే రైతులకు సకాలంలో యూరియా అందడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పలమనేరు మండల వ్యవసాయ కేంద్ర వద్ద యూరియా కోసం రైతులు బారులుతీరారు. ఉదయం నుండి బారులు తీరిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సుమారు 12 గంటల వరకు యూరియాను అందించారు. అనంతరం రైతులకు యూరియా ఇవ్వక పోవడంతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది.*

***మండలంలో యూరియా కొరత లేదు-మండల వ్యవసాయ శాఖ అధికారిణి:***
*మండలంలో యూరియా కోరత లేదని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సంధ్య తెలిపారు. ఇప్పటి వరకు 500 మెట్రిక్ టన్నుల యూరియ వచ్చిందని గత రెండు రోజులలో సుమారు 300 బస్తాలు రైతులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మంగళవారం సుమారు 200 మంది రైతులకు టోకన్లు ఇవ్వడం జరిగిందని వారికి మాత్రం బుధవారం ఇవ్వడం జరుగుతుందని రైతులకు తెలపడం జరిగిందని తెలిపారు. నేడు(ఈనెల 07)న మండలంలోని ఎరువుల దుకాణాలలో యూరియా రైతులు తీసుకోవచ్చని తెలిపారు. పలమనేరులో 13 ఎరువుల దుకాణాలు ఉన్నాయని నేటి నుండి రైతులకు యూరియా దుకాణాలో తీసుకోవచ్చని యూరియాకు కొరత లేదని ఆమె తెలిపారు. అధిక శాతంలో యూరియ వినియోగం ద్వారా భూమి క్షీణిస్తుందని ఎటువంటి పంటలకు యూరియా వినియోగించాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.*

## ఎస్.ఐ సంతకం ఫోర్జరీ!

చిల్లకూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త
ఎస్ఐ సంతకం ఫోర్జరీ చేసిన విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని సమగ్ర విచారణ జరిపి చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేసి నోటీసు ఇష్యూ చేసారు. సెక్షన్ లతో ఎఫ్ఐఆర్ నమోదు ముద్దాయి అయిన చిన్నరాజ పలు సర్టిఫికెట్లు తయారీ చేసి ఇచ్చినట్లు ఆరోపనులున్నాయి. ఆధార్ కార్డులలో వయస్సును కూడా మార్చినట్లు తెలుస్తుందన్నారు. కాసులకి కక్కుర్తి పడిన చిన్నారాజ ఎస్.ఐ సంతకాన్ని ఫోర్జరీ చేసి హాయిగా చలామణి అయ్యేవాడు. కొద్ది రోజుల క్రితం ప్రవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అన్న ఆరోపణలు కూడా వెలువెత్తుతున్నాయి. చిల్లకూరు మండలం, చింతవరం గ్రామంలో ఆన్లైన్ సర్వీస్ నిర్వహిస్తున్న చిన్నరాజ ఏకంగా చిల్లకూరు ఎస్.ఐ సంతకాన్నే ఫోర్జరీ చేసిన ఉదంతమిది. ఎస్.ఐ కదా ఏమి కాదులే అనుకున్నారో లేక ఏమి చేసినా ఏదొక విధంగా తపించుకోవచ్చు అనుకున్నాడో చిల్లకూరు ఎస్.ఐ సంతకాన్ని ఫోర్జరీ చేసి, కాసులకోసం కంపెనీలో ఉద్యోగంలో చేరడానికి పోలీసులు ఇచ్చే "క్లియరెన్స్ సర్టిఫికేట్" ను చిన్నరాజ తయారుచేసి వేరొకరికి ఇవ్వడంతో చిన్నరాజాపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ముద్దాయి. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ మొదలగు సర్టిఫికేట్లు, డ్రవింగ్ లైసెన్సులు, ఆధార్ కార్డులలో వయస్సు మార్చడం వంటివి తయారు చేసి కావలసిన వరకు దండుకున్నట్లు ఆరోపనలు ఉన్నాయి. చిన్నరాజ ల్యాబ్ ట్యాబ్ ను సీజ్ చేసిన పోలీసులు ఎంతవరకు పురోగతి సాధిస్తారో చూడాలి.




## గూడూరును జిల్లా చేయాలి లేదా నెల్లూరు జిల్లాలో కలపాలి

### క్రీడాకారులు, వాకర్స్ ర్యాలీ




గూడూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త:
గూడూరును జిల్లాగా చేయాలని క్రీడాకారులు, వాకర్స్ ర్యాలీగా ప్రదర్శన చేయడం జరిగింది.. ఈ సందర్భంగా వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలక్షన్‌లో బాగంగా ప్రచారానికి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , లోకేష్ బాబు, బాలకృష్ణ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. వారు చెప్పినటువంటి అన్ని పథకాలు అమలు పరుస్తూ ఉన్నారు. అదేవిధంగా వారు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరులో జిల్లాలో కలపాలని తెలిపారు. శాసనసభలో మన ఎమ్మెల్యే గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రతిపాదించినప్పుడు అసెంబ్లీలో ఉన్నటువంటి విద్యాశాఖ మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారన్నారు. ప్రత్యేక జిల్లాలు ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్లయితే గూడూరును జిల్లా చేసినట్లయితే గూడూరులో ప్రధానంగా రైల్వే డివిజన్, రెవెన్యూ డివిజన్, నిమ్మకాయల వ్యాపారం ఉన్నాయన్నారు. చిల్లకూరు మండలం పారిశ్రామిక రంగంలో ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విధంగా గూడూరును జిల్లా కేంద్రంగా చేసినట్లయితే అన్ని వనరులు గూడూరులో ఉన్నందున గూడూరు జిల్లాగా చేయమని ఎమ్మెల్యే ద్వారా కోరుతున్నామన్నారు. గూడూరు నుంచి ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, సాధారణ ప్రజలు తిరుపతికి వంద కిలోమీటర్లు పైగా వెళ్లి వారి యొక్క సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవటానికి ఒకరోజు గడచిపోతుందన్నారు. ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్నట్లుగా 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లూరులో గూడూరును కలిపినట్లయితే అందరికీ అనుకూలంగా ఉంటుంది.. చంద్రబాబు నాయుడు, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరు జిల్లాలో కలపవలసిందిగా కోరుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, పీవీకే శర్మ, సుమన్ రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, సాయి, మునీఫ్, శశిధర్, మొబైల్ రాజా, ప్రసాద్, చిన్నారావు, రజనీకాంత్, హగ్గయ్య, సందీప్, ఇమ్రాన్ ఇతర క్రీడాకారులు వాకర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా నాగదేవత విగ్రహాల ప్రతిష్ట

రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



మండలంలోని చింతకుప్పం గ్రామంలో అరుణ మెస్ నాగరాజు కుటుంబీకులచే నాగదేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గణపతిహోమం, నవగ్రహశాంతిపూజ, కలశస్థాపన అనంతరం విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం శ్రీఅశ్వర్థ నారాయణస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు భక్తులకు భోజన వసతి కల్పించారు.

## ఎరువుల దుకాణాల్లో డిఎఒ ఆకస్మిక తనిఖీలు

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణారెడ్డి బుధవారం కుప్పంలోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎరువుల దుకాణాల్లో స్టాకు ఉన్న ఎరువులు, యూరియా వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. ప్రతి ఎరువుల దుకాణం ఎదుట విధిగా ఎరువుల స్టాకు, ధరలు రైతులకు తెలిసేలా బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. రైతులు కోరిన ఎరువులు, యూరియాను విక్రయించాలన్నారు. ఎరువులు, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఫయాజ్ బాషా, రాజ్యలక్ష్మి, ఎఇఒ ఔరంగ్ పాల్గొన్నారు.

## సింధూర పార్కుగా నామకరణం చేయండి

పుంగనూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త



పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన మున్సిపల్ పార్క్‌కు దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాన్ని గుర్తు చేస్తూ "ఆపరేషన్ సింధూర్ పార్క్"గా నామకరణం చేయాలని ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అయూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశం కోసం పోరాడిన సైనికుల సేవకు గుర్తింపుగా పార్కుకు ఆపరేషన్ సింధూర్ పేరును పెట్టాలని మున్సిపల్ కమిషనర్, కౌన్సిల్‌ను వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట గిరి, బి. నరసింహులు, కృపాకర్, నాగరాజా, అమర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే దిశగా ఇది ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి చేయడం తగదు

ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

కడప జిల్లాలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై తెదేపా శ్రేణులు దాడి చేయడం దారుణమని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల జడ్పీటిసి ఉప ఎన్నికలకు సంబంధించి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ నల్గొండవారిపల్లిలో ప్రచారం చేస్తుండగా దేశం శ్రేణులు ఎమ్మెల్సీ కాన్వాయ్‌ను అడ్డుకుని రెండు వాహనాలు ధ్వంసం చేసి రమేష్ యాదవ్‌పై దాడి చేయడంను ఖండిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

పుత్తూరు రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... పుత్తూరు మండలం తడుకు పంచాయతీ పరిధిలోని చంద్రప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన నారాయణ, నవనీతమ్మ దంపతులు పుత్తూరులో దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జూలై 31న గురువారం రాత్రి పుత్తూరు నుంచి ఆటో దిగి రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు నుంచి పుత్తూరుకు వస్తున్న ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య, భర్త ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని పుత్తూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వెళ్లాక నారాయణను పరీక్షించిన డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన నవనీతమ్మకు చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కేవీబీ పురం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలం పెరిందేశంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 94 మంది పేద విద్యార్థులకు స్లేట్‌లు, పెన్సిల్, పెన్నులు, నోటు పుస్తకాలు, తదితరవి బుధవారం పిల్లారి ఫౌండేషన్ సహకారంతో దాతలు అందించారు. విద్యార్థులు ప్రేమతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు. కార్యక్రమంలో దాతలు అమరావతి, కుమారుడు టోనీ, పిల్లారి ఫౌండేషన్ డైరెక్టర్ మురళి, డీవైఎంసీ మెంబరు తలారి అయ్యప్ప, గ్రామ సర్పంచ్ మురగమ్మ,బత్తెయ్య, గోవిందయ్య, తలారి నాగరాజు, తలారి అజిత్, మునెయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 14న జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 చిత్రం విడుదల

తిరుపతి హెల్త్, ఆగస్టు 6 ప్రభాతవార్త ః



జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 చిత్రం ఈనెల 14వ తేదిన ప్రేక్షకుల ముందుకు రానుందని, ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో వెయ్యి నుంచి 2వేల బైకులతో తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయం నుంచి సంధ్యా థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తిరుపతి జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ క్లబ్ అధ్యక్షులు కిరిటీ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 చిత్రం ప్రేక్షకులను అలరించి మంచి ఆదరణతో విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. థియేటర్ వద్ద 55 అడుగు ఎత్తుగల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తులసి, జ్ఞానేశ్వర్, సోము, ప్రకాష్, హేమంత్ ఆకాష్, ధోని తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పలమనేరు టౌన్, ఆగస్టు 6 ప్రభాతవార్త:

అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీకి చెందిన లక్ష్మీదేవి(29) వివాహం జరిగి ఇద్దరు పిల్లలు కలరు.ఆమెకు మతిస్థిమితం సరిగాలేకపోవడంతో తరచూ ఇంటి నుండి వెళ్ళడం జరుగుతుందని తెలిపారు.ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పట్టణం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నీటి కుంటలో ఓ మహిళ మృతదేహాని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలు లక్ష్మీదేవిగా గుర్తించి మృతదేహంపై బట్టలు లేకపోవడం,గాయాలు ఉండడంతో పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్డీఓ..డిఎస్పీ కార్యాలయాల నిర్మాణానికి చర్యలు



– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

కుప్పం కొత్తపేటప్రాంతంలో నూతనంగా ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయాల భవనాల నిర్మాణంకు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ సిద్ధిబుద్ధిసమేత శ్రీవినాయకస్వామి ఆలయంలో ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ డా॥ సుధీర్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పులతో కలసి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం కొత్తపేట ప్రాంతంలో గతంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ స్థలంలోని పాత గదులను తొలగించి నూతనంగా ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయాల నిర్మాణంకు సంబంధించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని అన్ని విధాలా ఆదర్శం చేయడమే తమ లక్ష్యమన్నారు. కొత్తపేట అభివృద్ధికి సహకరిస్తామని ప్రజలు ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీఓ, డిఎస్పీ కార్యాలయాలు ఈ ప్రాంతంలో వస్తే అభివృద్ధి మరింత జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, సోమశేఖర్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ తిరుమగళ్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, అన్సర్, శ్యామసుందర్, మంజునాథ్, కృష్ణన్, హర్షధర్మతేజ, బాలాజీ, వాసు తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణులను ఆదుకుంటోంది సిఎం చంద్రబాబే

– టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులను ఆదుకుంటోంది సిఎం చంద్రబాబునాయుడేనని టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాపై మంత్రి మండలి సమావేశంలో ఆమోదం తెలపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు నాయీ బ్రాహ్మణులకు అధికారంలో రాగానే ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరగా స్పందించిన సిఎం చంద్రబాబు నేడు అధికారంలో వచ్చాక నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మాట మేరకు రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు ఆమోదించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆయన సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితకు రాష్ట్ర నాయీ బ్రాహ్మణుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## కుప్పంలో ప్రధాన రోడ్డు విస్తరణకు సర్వే

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణంలో ప్రధాన రహదారి నేతాజీ రోడ్డులో మూడో రీచ్ పరిధిలో రోడ్డు విస్తరణకు సంబంధించి బుధవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో సర్వేయర్ సాయి బృందం సర్వే మొదలుపెట్టింది. 2014–19 మధ్య కాలంలో కుప్పం పట్టణంలోని ప్రధాన రహదారిని మూడు రీచ్‌లుగా విభజించారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సర్కిల్ నుంచి పాతపేట చెరువు కట్ట దాకా ఒక రీచ్, పాతపేట నుంచి టౌన్ బ్యాంక్ సర్కిల్ దాకా రెండో రీచ్, టౌన్ బ్యాంక్ సర్కిల్‌నుంచి రైల్వే గేటు క్రాస్ వరకు మూడో రీచ్‌గా విభజించారు. కాగా 2019 నాటికే రెండు రీచ్‌ల పరిధిలో రోడ్డు విస్తరణకు సంబంధించి బాధితులకు పరిహారం చెల్లించడంతో పాటు రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. రెండో రీచ్‌లో ఒకరిద్దరు తప్ప అందరూ రోడ్డు విస్తరణకు అంగీకరించడంతో పనులు పూర్తి చేశారు. కాగా 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక కుప్పంలో రీచ్ 3 పనులను ఉన్నతాధికారులు రద్దు చేశారు. మరలా సిఎంగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టడంతో రీచ్ 3 పనులు చేపట్టాలని అధికారులు, నేతలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణకు సంబంధించి సర్వే చేపట్టారు. కాగా రీచ్ 3లో దాదాపు 66 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

## 64లక్షలతో హరిజనవాడ పాఠశాల అభివృద్ధి పనులు

కుప్పంరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త



మండలంలోని అడవిబూదుగూరు హరిజనవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అభివృద్ధి పనులకు ఎంఇఒ రాజారాం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పాఠశాలకు అవసరమైన రెండు అదనపు తరగతి గదులు, ప్రహరీగోడ, వివిధ మరమ్మత్తుల పనులు ప్రస్తుతం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కడ పి.డి. వికాస్ మర్మత్ పాఠశాల అభివృద్ధికి 64లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు.పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎ ంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, నేతలు కృష్ణమూర్తి, చిట్టిబాబు, గణేష్, బాలకృష్ణ, శరవణ, ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరించాలని వినతి

రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



చెల్దిగానిపల్లి పంచాయతీ జీడిగుట్ల గ్రామంలో మంచి నీటి సమస్య పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ నేతలు బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలో మూడు నెలలుగా మంచి నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో నూతన బోరు వేసి ట్యాంకు నిర్మించాలని కోరారు.కార్యక్రమంలో నేతలు వెంకటేష్, గోవిందప్ప, రాఘవేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రహదారి పక్కనే పొంచి వున్న విద్యుత్ ప్రమాదం

–భయాందోళనలో రైతులు



చౌడేపల్లి, ఆగస్టు 5 ప్రభాతవార్త నిత్యం వాహనాలు ప్రజలు సంచరించే ప్రాంతంలో విద్యుత్ ప్రమాదం పొంచివుంది. రహదారి పక్కనే పరిస్థితి ఇలా వుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చౌడేపల్లి–పలమనేరు ప్రధాన రహదారిలో శెట్టిపేట వద్దగల రెండు చెక్‌డ్యాముల సమీపంలో బోరుకు మోటారును అమర్చి దానికి సంబంధించిన స్టార్టర్ మిద్యుత్ మీటర్‌ను ఉంచారు. అయితే మీటరుకున్న విద్యుత్ సరఫరా వైరు ఎలాంటి భద్రతా లేకుండా వదిలేశారు. దీంతో వాహనదారులే కాకుండా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పొలాల వద్దకు వెళ్ళే రైతుల పశువులను ఆ మార్గం నుంచి వెళ్ళాలంటేను ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రమాదం సంభవించక ముందే స్పందించాలని రైతులు కోరుతున్నారు.

## వర్షం కురిస్తే ఊరంతా చెరువే...!

కాగతి(చౌడేపల్లి), ఆగస్టు 5 ప్రభాతవార్త



వర్షం కురిస్తే ఆ గ్రామ ప్రజల గుండెల్లో వణుకు పుడుతుంది. నీరంతా ఇళ్ళల్లోకి ప్రవేశించి భయాందోళనకు లోనవుతున్నారు. మండలంలోని కాగతి పంచాయతీ యనమసానిపల్లిలో 50పైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. కొద్దిపాటి వర్షం కురిస్తేనే వీధులన్నీ జలమయమవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్లు, వీధికాలువలు లేక పోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని వారంటున్నారు. వర్షం కురిస్తే రాత్రంతా జాగరణ చేయాల్సి వస్తోందన్నారు. కుటుంబ సభ్యులందరూ ఇళ్ళల్లోని నీటిని తోడి బయట పడేస్తున్నామన్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఇబ్బందిగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## పార్టీల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

వైసీపీ నాయకులకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభ నాగరాజ హితవు

యర్రావారిపాలెం, ఆగస్టు 6 ప్రభాతవార్త



చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీల పేరుతో వైసీపీ నాయకులు విద్వేషాలు రెచ్చగొట్టొద్దు అని చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభ నాగరాజ తెలిపారు. నియోజకవర్గంలో 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అయిన పులివర్తి నాని 40 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఆయన ఏనాడు కూడా ప్రజల్లో విద్వేషాలను రేగొట్టలేదని తెలిపారు. రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సాధిస్తున్నారని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు ఏ కార్యకర్త పై కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని అన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ కోసం, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పార్టీల పేరుతో రెచ్చగొడుతూ రాజకీయాలు చేసేవారికి ప్రజలే బుద్ధి చెబుతారని ఎద్దేవా చేశారు.

## ప్రారంభోత్సవానికి నోచుకోని గ్రంథాలయం

పూతలపట్టు, ఆగస్టు 6 ప్రభాతవార్త



మండల కేంద్రమైన పూతలపట్టు నందు గ్రంథాలయం నూతనంగా నిర్మించి సుమారు రెండు సంవత్సరాల పైబడిన ఇంకను ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం దురదృష్టకరమని స్థానికులు, విద్యార్థులు, ఉద్యోగులు విచారణ వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూతలపట్టు నందు ప్రస్తుతానికి ఒక గ్రంథాలయం తాత్కాలికంగా ఒక గదిలో ఏర్పాటు చేసినప్పటికీ గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారో ఎప్పుడు మూస్తారో ఎవరికి తెలియడం లేదు నిరంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేట్లు మూసివేయడం చేత గ్రంథాలయ అధికారి గ్రంథాలయం ఎప్పుడు తెరిస్తున్నాడు ఇంతకీ వస్తున్నాడా లేదా అని విద్యార్థులు, ఉద్యోగస్తులు ఆలోచనలో పడ్డారు ఇకనైనా జిల్లా గ్రంథాలయ అధికారులు పట్టించుకోని నూతనంగా ఏర్పాటు చేసినటువంటి గ్రంథాలయాన్ని ప్రారంభోత్సవం చేయాలని పూతలపట్టు మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కూటమి హామీలను ఎండగట్టాలి

సదుం, ఆగస్టు 6, ప్రభాతవార్త



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చడం లేదని వాటిని ఎండగట్టాలని జెడ్పిటిసి సోమశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలమంద ఊటుపల్లె, కంభం వారి పల్లె, తాడిగుంటపాలెం పంచాయతీల్లో బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావాలని పూజలు చేశారు. అదేవిధంగా క్యూఆర్ కోడ్ ద్వారా కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోను డౌన్లోడ్ చేసి, వారు ఇచ్చిన దొంగ హామీలను ప్రజలకు తెలిపారు. .ఈ కార్యక్రమం లో సదుం జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి పార్టీ అధ్యక్షులు రెడ్డెప్ప రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపిపి ధనుంజయ రెడ్డి, అమరావతి పుత్రాజు, స్థానిక సర్పంచ్‌లు మనోహర రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, హనుమంత రెడ్డి,రెడ్డి దీప, ఎల్లప్ప ఎంపిటిసిలు స్వరూప గుణాకర రెడ్డి, మల్లికార్జున, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి, జిల్లా రైతువిభాగం ప్రధాన కార్యదర్శి గిరిధర రెడ్డి, ఎస్సి సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ సీతాపతి, వై ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని భూబకాసురుల ఆక్రమణ

పూతలపట్టు, ఆగస్టు 6 ప్రభాతవార్త



పూతలపట్టు మండలం పి. కొత్తకోట రెవిన్యూ తిరుమల కొండయ్య గారి పల్లి నందు బుధవారం అక్రమంగా ప్రభుత్వ భూమిలో చొరబడి జెసిబితో ప్రభుత్వ భూమిని చదును చేయడమే కాకుండా మట్టిని అక్రమంగా జెసిబితో తవ్వి బయట తరలించడం విషయం తెలుసుకున్న పూతలపట్టు తాసిల్దార్ రమేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని జెసిబిని సీజ్ చేసి పూతలపట్టు పోలీస్ స్టేషన్ నందు అప్పగించారు.

## కట్నం కోసం భర్త వేధింపులు: గృహహింస కేసు నమోదు

తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని బహదూరుపేటలో నివాసముంటున్న సుప్రియ తనను భర్త అదనపు కట్నం కోసం వేధిస్తూ,హింసిస్తున్నారని టూటౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసారు.ఈ ఫిర్యాదు మేరకు గృహ హింస కేసును నమోదు చేసినట్లు సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు.సుప్రియ ఇచ్చిన ఫిర్యాదులో ఇలా వివరించారు. శ్రీకాళహస్తికి చెందిన సుప్రియ కు 2021లో వివాహం జరిగినట్లు వివరించారు. వారికి ఒక బాబు ఉన్నాడు. భర్త నాయుడుపేటలో ఓ ట్రాన్స్‌పోర్టులో పని చేస్తున్నారు. భర్త నిత్యం కట్నం కోసం వేధిస్తూ సాధింపులు చేస్తున్నారని ఫిర్యాదు చేసారని వివరించారు.ఆమె ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## శ్రీజ మహిళా సభ్యులకు శిక్షణ

శ్రీకాళహస్తి రూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త

ఏర్పేడుమండలంలోని మహిళా సంఘాలకు శ్రీజడెయిరి సారధ్యంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం జైకా ప్రాజెక్టుల సహకారంతో మహిళ సమాఖ్య కార్యాలయంలో శ్రీజ పాలడెయిరి నిర్వాహకులు పాడి పరిశ్రమ మీద మహిళా సభ్యులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీజ సంస్థకు సంబంధించి మేనేజర్ విశ్వనాథం మాట్లాడుతూ మహిళా పాలు ఉత్పత్తిదారుల కోసం శ్రీజ డెయిరి ఏర్పడిందన్నారు. పాలసేకరణలో డెయిరి భారత దేశంలో ద్వితీయ, రాష్ట్రంలో మూడవ స్థానంలో ఉందన్నారు.గ్రామ స్థాయి విసిజి సభ్యులు విధులు బాధ్యతలు వివరిస్తూ ప్రతి ఏడుగురు సభ్యుల్లో ఒకరిని ఎన్నుకుంటారని వారికి రాయటం చదవటం తెలిసి ఉండాలన్నారు. సభ్యురాలు ఏడవ తరగతి చదివి ఉండాలన్నారు.వారికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా అధికారి నాగభూషణం యాదవ్, చెంచుమోహన్,ఎపిఎం సరిత,సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రప్రభ వాహనంపై నీలకంఠుని దివ్యదర్శనం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరునికి అనుబంధంగా ఉన్న మండలంలోని ఊరందూరులో వెలసిన నీలకంఠేశ్వరుని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చంద్రప్రభవాహనంపై తనదివ్యదర్శనం ఇచ్చారు. ఇక్కడి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.ఈ నేపథ్యంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క వాహనంపై దర్శనం ఇస్తున్నారు. స్వామిఅ మ్మవార్లను ప్రధానార్చకులు జనార్థన్‌శర్మ,గిరిధర్ శర్మలు ముస్తాబు చేయగా గ్రామోత్సవం కన్నుల పండువగా సాగింది. గ్రామోత్సవాన్ని తిలకించటానికి గ్రామస్తులు హాజరయ్యారు. ఆలయ ప్రతినిధులు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్, రవిలు పర్యవేక్షించారు.

## బీజేపీ ఈస్ట్ మండలం నూతన అధ్యక్షునిగా ఆదం అనిల్‌కుమార్ రెడ్డి నియామకం

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6 ప్రభాతవార్త ః



బీజేపీ ఈస్ట్ మండలం నూతన అధ్యక్షునిగా ఆదం అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించారు. స్థానిక ఎస్ఎస్ కిడ్స్ ప్లే అండ్ పౌండేషన్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమానికి టీటీడీ బోర్డు మెంబరు భాను ప్రకాష్‌రెడ్డి, బీజేపీ నేతలు హాజరై ఆదం అనిల్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

## బ్యాంకర్లు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6 ప్రభాతవార్త ః



బ్యాంకర్లు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శు భం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీసీ జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేసీతో పాటు డీఆర్వో జి. నరసింహులు, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సామంచి శర్మ, ఎల్డీఎం గుంటూరు రవి కుమార్‌లతో కలిసి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసీపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రైతులకు క్రాఫ్ లోను మంజూరు చేసేటప్పుడు పంటలకు ఇన్సూరెన్స్ చేయించాల్సిన బాధ్యత బ్యాంకు వారిదేనని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, వ్యవసాయ శాఖ పీడీ ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఘనంగా తల్లిపాల దినోత్సవం

తిరుపతి విద్య ఆగస్టు 6 ప్రభాత వార్త




పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో తల్లిపాల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయ ణమ్మ తల్లిపాలు అమృతంతో సమానమని,ఈ విషయంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని

## మెగా రిసాప్‌పై అవగాహన సెమినార్

తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థల సహకారంతో కలిసి, టైర్2,టైర్3 నగరాల్లో పెట్టుబడిదారుల విద్యపై అవగాహనను విస్తరించేందుకు మెగా ప్రాంతీయ పెట్టుబడిదారుల సెమినార్లను ఆవిష్కరించిన్నట్లు సెబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. రామ్ మోహన్ రావు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సెమినార్లు,పెట్టుబడిదారులకు సురక్షితమైన, బాధ్యతాయుత పెట్టుబడుల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు,సెక్యూరిటీల మార్కెట్లో కొత్తగా ప్రవేశించే వారికి సరికొత్త దిశను చూపిస్తాయి అని అన్నారు.ఇప్పటికే మార్కెట్లో ఉన్న పెట్టుబడిదారులకూ సమగ్ర సమాచారాన్ని అందించి,అవగాహనతో కూడిన పెట్టుబడుల వైపు ప్రోత్సహించడమే ఈ ప్రయత్నం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

## గూగుల్ ఏఐపై వర్క్ షాపు ప్రారంభం

తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త



పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం,ఐఐసీ, ఐక్యూఏసీ, అనుదీప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గూగుల్ ఏఐ ఎసన్షియల్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే వర్క్ షాపు బుధవారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ మాట్లాడుతూ ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ చాలా శక్తివంతమైందని,ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విద్య,ఆరోగ్య,సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, బ్యాంకు,రోబోలు,ఆర్థిక రంగాలలో విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు.విద్యార్థినులు ఏఐపై పట్టు సాధించాలనే ఉద్దేశంతో వర్క్షాపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ ్పరుచుకోవాలని సూచించారు.ఈ వర్క్ షాపులో సి సుబ్రమణ్యం రెడ్డి,డాక్టర్ ఉమారాణి,డాక్టర్ భద్రమణి,డాక్టర్ విద్యులత,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికశబ్దాన్నిచ్చే సైలెన్సర్లు, హారన్లు బిగించొద్దు

–ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి



తిరుపతికార్పొరేషన్, ఆగస్ట్ 6ప్రభాతవార్త తిరుపతి నగరంలో శబ్దకాలుష్యాన్ని వెదజల్లే వాహనాలకు, ద్విచక్రవా హనాలకు అధిక శబ్దాన్నిచ్చే సైలెన్సర్లు, రకరకాల హారన్లు బిగించొద్దని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి హెచ్చరించారు. వీటివల్ల చాలా సమస్యలు ఉన్నాయన్నారు. వాహనాలకు నిబంధనల మేరకు హారన్లు ఉండేలా మెకానిక్‌లు చూడాలన్నారు. నగరంలో ద్విచక్రవాహనాల మెకానికల్‌ల అసోసియేషన్ నాయకులు మునిరెడ్డి,ప్రభు, మోహన్,.సింధు,సాయి,వేలు ,లుక్కీలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రజలు ఇబ్బందిపడేలా హారన్లు ఉండరాదని సూచించారు.

## పాఠశాల ఆవరణను సుందరీకరించండి..!

**సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్**



***చంద్రగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:*** పాఠశాల ఆవరణను సుందరీకరించాలని సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ అన్నారు. స్థానిక శ్రీ పద్మావతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, భవిత స్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినుల మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలనీ, వంటగది అభివృద్ధి చేయాలని ఆదేశించారు. క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రమంలో మిత్ర కిట్‌లను పరిశీలించారు. తరగతి గదుల్లో డిజిటల్ బోధనలను పరిశీలించారు. వచ్చే ఏడాది పది ఫలితాలలో ప్రతి ఒక్కరూ అత్యుత్తమ స్థాయి మార్కులు సాధించి, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అంతకు ముందు ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల భవిత కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలను ప్రశ్నలు అడిగి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి వస్తున్న పేరెంట్స్‌ను సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి సుధాకర్ నాయుడు, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఇన్‌చార్జ్ హెచ్ఎం రమాదేవి, భవిత ఉపాధ్యాయులు ఎన్.వి.రాజేశ్వరి, ఎస్.శ్యామలాదేవి, సిబ్బంది నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## దిక్కున్న చోట చెప్పుకోమంటున్నారు..!

**రైతులకు న్యాయం చేయండి..!, పోలీసులకు చంద్రగిరి రైతు ఫిర్యాదు**



**చంద్రగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** మా పొలాలను మీ పశువులు, మేకలు, గొర్రెలు నాశనం చేస్తున్నాయంటే దిక్కున్న చెప్పుకోండంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని చంద్రగిరి రైతులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు యారాశి చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు మేరకు.. దోర్నకంబాల పంచాయతీ, బోనం కాలువ ఎస్టీ కాలనీ సమీపంలో గల రైతులు తమ వ్యవసాయ పొలాలలో మామిడి మొక్కలు, వరి, వేరుశెనగ వంటి పంటలను పండిస్తున్నట్లు పేర్కొన్నారు. కొంత మంది రైతులు తమ పొలంలో ఇటుక బట్టీలను నిర్వహించుకుంటూనే వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. రాయలపురం గ్రామానికి చెందిన పైడిపాటి మహేష్, అతని కుటుంబ సభ్యులు (మహిళలు) తమకు గల ఆవులు, మేకలు, గొర్రెల గుంపును అడవికి తరలించే క్రమంలో మా పొలాలలోపడి పంటలను నాశనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇటుక బట్టీల వారు తయారు చేసుకున్న పచ్చి ఇటుకలను తొక్కుకుంటూ వెళ్ళిపోతున్నట్లు తెలిపారు. పలుమార్లు మహేష్‌కు చెప్పినప్పటికీ అతను లెక్కచేయకపోగా మీకుదిక్కున్న చోట చెప్పు కోండంటూ పరుష పదజాలంతోఎదురుదాడికి దిగుతున్నట్లు వాపోయారు.పోలీసులువిచారణజరిపిన్యాయంచేయాలని కోరారు.

## గుడిమల్లం ఆలయ హుండీల లెక్కింపు

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త**




గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి సారధ్యంలో లెక్కింపు జరిపారు. 49 రోజులకు రూ.3.5లక్షలు ఆదాయం వచ్చింది. ఇటీవల కాలంలో గుడిమల్లంకు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి చక్కటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి రూపకల్పన చేసారు. బుధవారం లెక్కింపులో రూ.3,48,126లు వచ్చినట్లు ఇఓ రామచంద్రారెడ్డి వివరించారు.

## రూరల్ ఇన్‌చార్జి సిఐగా గోపి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిరూరల్ సిఐగా పని చేసిన అధికారి విఆర్‌కు పంపగా నెల తరువాత ఆ బాధ్యతలను వన్‌టౌన్ సిఐ డి.గోపికి అప్పగించారు.శ్రీకాళహస్తి రూరల్‌లో సిఐగా పని చేసిన అధికారి స్థానిక నాయకులతో ఇమడ లేక పోయారు.దాంతో ఆతన్ని విఆర్‌కు పంపారు. నెలకు పైగా సిఐ నియమించలేదు.దాంతో జిల్లా ఎస్‌పి ఆ బాధ్యతలను సిఐను నియమించే వరకు వన్‌టౌన్ సిఐ డి.గోపికి అప్పగిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. బుధవారం డి.గోపి బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలో 46 పంచాయతీలు 66 రెవెన్యూ గ్రామాలున్నాయి. బుధవారం నుంచి రూరల్ బాధ్యతలను డి.గోపి పర్యవేక్షించనున్నారు.

## జైన్ సంఘం సారధ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**తొట్టంబేడు, ఆగస్టు 5 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలో జైన్ సంఘం సారధ్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి విశేష స్పందన లభిస్తుందని పట్టణ జైన్ సంస్థ మాజీ అధ్యక్షులు రమేష్ కుమార్ పత్రికల వారికి తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటివారం నిరుపేదలకు పట్టణంలోని జెటిపాళెం వీధిలో ఉన్న జైన్ ప్రార్ధన మందిరంలో ఉచిత కంటివైద్యశిబిరం చెన్నై అరవింద కంటివైద్యులచే నిర్వహిస్తామన్నారు.అక్కడ వచ్చిన వారికి మధ్యాహ్నం ఉచితంగా భోజన సుపాయం జైన్‌సంస్థ పర్యవేక్షిస్తుందన్నారు.ఈ మేరకు ఈ నెల 96 మందిని పరిక్షించగా అందులో 54 మందికి ఆపరేషన్ అవసరం వచ్చిందని వారికి ఉచితంగా బస్సును ఏర్పాటు చేసి తిరుపతిలోని అరవిందకంటి ఆసుపత్రికి తీసుకెళ్ళామన్నారు. కంటి ఆపరేషన్ల తరువాత లేన్స్‌కు సుమారు 80000 రూపాయిలు అయ్యే ఖర్చును జైన్ సంస్థ 20000 లకే అందిస్తున్నామన్నారు. నూతనంగా జైన్ సంస్థ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన ధ్యానచంద్‌కు వారి కమిటి వారు శుభాకాంక్షలు తెలిపారు.

## బాల్‌బ్యాడ్మింటన్ జట్లు ఎంపిక



**శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త**

ఉమ్మడి చిత్తూరుజిల్లా సీనియర్స్,సబ్‌జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటస్వామి కార్యాదర్శి పి.బాలాజి జాబితాను విడుదల చేసారు. బుధవారం విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి.మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా పరిశీలకులుగా టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నాగార్జున్‌రెడ్డి గుట్లూరు మయూర్, కోలా విశాలక్షి హాజరయ్యారు. వారి సమక్షంలో జరిగిన ఎంపికలో నిబంధనల మేరకు ప్రకటించారు. కొట్టెసాయి, గరికపాటి చంద్ర పాల్గొన్నారు. ఎంపిక చేసిన జట్లుకు సంబంధించి ముఖ్యఅతిధుల సమక్షంలో జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

***సబ్‌జూనియర్స్ బాలుర జట్టు:*** ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపికకు సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వారిలో సబ్‌జూనియర్స్ జట్టుగా డి.లక్ష్మీనరసింహారెడ్డి(నగరి), ఎం.హేమంత్(శ్రీకాళహస్తి). రక్షణ్( చంద్రగిరి),దర్శన్ (శ్రీకాళహస్తి), దిలీప్(శ్రీకాళహస్తి),భరత్(శ్రీకాళహస్తి), జంబాడ నికాష్,నాగరాజు, మహమ్మద్ హుసేన్ (పీలేరు)లను ఎంపి చేసినట్లు ప్రకటించారు.

***సబ్‌జూనియర్స్ బాలికల జట్టుగా*** ఉమ్మడి చిత్తూరుజిల్లా బాలికల సబ్‌జూనియర్స్ జట్టుగా ప్రశాంతి (శ్రీకాళహస్తి)టి.జోష్ణ( నాగరాజు కుప్పం) నాగలక్ష్మీ(నగరి) భాను ప్రియ (తిరుపతి),జూలి (జంబాడ) దుర్గ (తిరుపతి), కల్పన (జంబాడ) శ్రీలక్ష్మీ(మదనపల్లి),నిహారిక (మదనపల్లి) లక్ష్మీప్రియ (శ్రీకాళహస్తి)లను ఎంపి చేసినట్లు తెలిపారు.

***సీనియర్ బాలికల జట్టు:*** ఉమ్మడి చిత్తూరుజిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు సీనియర్ మహిళలు స్వర్ణలత (శ్రీకాళహస్తి),స్వప్న(శ్రీకాళహస్తి),మమత(నగరి)తేజు మహిళా యూనివర్శిటి తిరుపతి) రమ్య (శ్రీకాళహస్తి), ఉషారాణి (పీలేరు), ఉమ(శ్రీకాళహస్తి) గీతిక(శ్రీకాళహస్తి),విమల (విజయపురం),చంద్రిక (మహిళా యూనివర్శిటి)రిత్విక(శ్రీకాళహస్తి),డిస్మిత(శ్రీకాళహస్తి)ఆర్‌లక్ష్మీ(శ్రీకాళహస్తి),యామిని(మహిళా యూనివర్శిటి) మాలతి (మహిళా యూనివర్శిటి)లను ఎంపిక చేసారు.

***బాలుర సీనియర్ జట్టు:*** శ్రీకాళహస్తిలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టుగా సీనియర్ బాలుర జట్టును నిర్వాహాకులు ప్రకటించారు. ఇందులో రాజేష్ (పీలేరు), మనోజ్‌కుమార్‌రెడ్డి (పీలేరు), తేజేష్ (నగరి) ఇక్బాల్(నగరి), విష్ణువర్ధన్ (పీలేరు),పవన్‌కుమార్( మదనపల్లి), వెంకట్ (శ్రీకాళహస్తి),బి.మనోజ్‌కుమార్( ఎర్రవారి పాళెం), తరుణ్ (శ్రీకాళహస్తి),క్రాంతి కుమార్ (శ్రీకాళహస్తి)లను ఎన్నుకున్నారు.

## త్రినేత్ర వైద్యాలయంలో ఉచిత కంటి అద్దాలు పంపిణి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి స్థాపించిన 'భక్త కన్నప్ప కంటి ఆసుపత్రి' సుమారు 32 సంవత్సరాలుగా నిరుపేదలకు కంటి వెలుగులు అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం ఇక్కడ ఆపరేషన్లు చేయించుకున్న 35 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందించారు. శ్రీకాళహస్తిలోని చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేలాది మందికి ఉచితంగా కంటి వైద్యపరీక్షలు జరిపి ఉచిత వైద్యంతో పాటు ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. ఇక్కడ ఆసుపత్రి స్థాపన నుంచి సుమారు లక్షమందికి వైద్యసేవలు అందించినట్లు సమాచారం. ప్రస్తుత పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి ప్రత్యేక శ్రద్ధ వహించారు. వారం వారం ఈ ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.ఈనేపథ్యంలో బుధవారం 35 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి బోర్డు సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు, అందించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ జయచంద్రప్ప ఆసుపత్రి సిబ్బంది ధార్మిక వాదులు పాల్గొన్నారు.

## తొట్టంబేడుకు కొత్త ఎస్ఐ



**తొట్టంబేడు,ఆగస్టు 6 ప్రభాతవార్త**

తొట్టంబేడు ఎస్ఐగా కె.బలరాంను నియమిస్తూ జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారి చేసారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పని చేసిన రామంజనేయులు అధికార పార్టీతో విభేదించారు. సంబంధం లేని అంశాల్లో తలదూర్చారు.దాంతో అధికార పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఎస్ఐ తీరును మండల తెలుగుదేశం నాయకులు శాసనసభ్యునికి ఫిర్యాదు చేసారు. ఫలితంగా ఇక్కడ పని చేసిన రామంజనేయులును విఆర్‌కు పంపారు. ఆయన స్థానంలో కొత్త ఎస్ఐగా కె.బలరాంను నియమించారు.ఏడాదిలో ఈ స్టేషన్‌లో ముగ్గురు ఎస్ఐలు మారారు. పోలీసుస్టేషన్ల హద్దులు గందరగోళంగా ఉంది.

## గుంతలను పూడిపించిన సర్పంచ్...

**రేణిగుంట ఆగస్టు 6 ప్రభాతవార్త**

రేణిగుంట బజారు వీధి శ్రీ గంగమ్మ స్థూలం వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుపై బాగా గుంతలు పడడంతో సర్పంచ్ నాగేశం పంచాయతీ కార్మికుల ద్వారా బుధవారం దగ్గరుండి మరమ్మత్తులు చేయించారు. గంగమ్మ స్థూలం, ఆర్టీసీ బస్టాండు, బజారు వీధిలో ఏర్పడిన గుంతలను స్వామి వివేకానంద యోగ అసోసియేషన్ గురువు వెంకటేష్ ఫోటోలు తీసి వాట్సాప్ ప్రసార మాధ్యమ వేదికగా ప్రశ్నించారు. శ్రీ గంగమ్మ జాతరను దృష్ట్యా రోడ్డును మరమ్మతు చేయించాల్సిందిగా, పలువురు ఆటో డ్రైవర్లు సర్పంచ్‌ను కోరారు.దీంతో స్పందించిన రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచ్ నాగేశం గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడిపించారు.

## అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పారిశుద్ధ పనులు

**రేణిగుంట, ఆగస్ట్ 6 ప్రభాతవార్త.**



రేణిగుంట సి ఆర్ ఎస్ సమీపంలో బుధవారం రేణిగుంట అర్బన్ పోలీసులు అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రజలతో కలిసి పారిశుద్ధ పనులు చేపట్టారు. ఇటీవల కొంతమంది పేకాట రాయుళ్ళు, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు సేవించే యువకులు పట్టణ మారుమూల మరుగు ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగించడంతో పోలీసులు వీటిపై దృష్టి సారించారు. అందులో భాగంగా రేణిగుంట అర్బన్ సీఐ జయ చంద్ర , ట్రైన్ ఎస్ఐ స్వాతి ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలతో కలిసి సి ఆర్ఎస్ దగ్గర ముళ్ళ పొదలు, గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. అక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరపరాదంటూ బ్యానర్ తగిలించారు.

## బీఎంఎస్ జిల్లా అధ్యక్షులుగా ఆకుల సుబ్రమణ్యం సతీష్‌కుమార్ ఏకగ్రీవం

**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 6 ప్రభాతవార్త :**




భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఆకుల సుబ్రమణ్యం సతీష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీనప్ప చేతులు మీదుగా ఆకుల సుబ్రమణ్యం సతీష్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. స్థానిక గాంధీరోడ్డులోని బీఎంఎస్ తిరుపతి జిల్లా కార్యాలయంలో ఆసంఘ్ జిల్లా నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన బీఎంఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఆకుల సుబ్రమణ్యం సతీష్‌కుమార్ మాట్లాడారు. కార్మికుల ప్రశ్నించే గొంతు బీఎంఎస్ అన్నారు. 1955లో ఒక సాధారణంగా ఉన్న సంఘం నేడు రెండు కోట్ల మందికి పైగా సభ్యులుగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. తనను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ కార్మికుల కష్టనష్టాలపై నిరంతర పోరాటాలు చేయడంతో పాటు సంఘ్ బలోపేతానికి సైనికునిలా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీఎంఎస్ అనేది పార్టీలకు అతీతంగా పనిచేసే ఏకైక సంస్థ అన్నారు. కార్మికుడి పనికి తగిన ఫలితాన్ని ఇచ్చేవిధంగా బీఎంఎస్ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి శీనప్ప మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ ఎంప్లాయిలుగా చేయడమే బీఎంఎస్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా నూతన కమిటీ సభ్యులు, నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీకాం డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

**తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త**



స్థానిక అన్నమయ్య సర్కిల్లోని సీకాం డిగ్రీ కళాశాల మరో మైలురాయిని దాటింది. కళాశాలకు అటానమస్ హోదా లభించిందని కళాశాల ఛైర్మన్ డాక్టర్ టి సురేంద్రనాథ్రెడ్డి తెలిపారు.ఇటవలీ నాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని,అటానమస్ కోసం దరఖాస్తు చేసుకోగా యూజీసీ కళాశాలలో విద్యా నాణ్యతా ప్రమాణాలను, మౌళిక వసతులను పరిశీలించి స్వయంప్రతిపత్తి హోదా కల్పించిందన్నారు.తిరుపతిలో అటానమస్ హోదా పొందిన తొలి డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొందడం హర్షించదగ్గ విషయమన్నారు.విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలపడమే సంస్థ లక్ష్యమని,ప్రతి ఏటా పేరొందిన అంతర్జాతీయ సంస్థలు క్యాంప్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతోందన్నారు.కళాశాలలో విద్యానభ్యసించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత స్థానాలలో ఉండటం కళాశాలకు గర్వకారణమన్నారు.ఈ స్థాయికి చేరుకోవడం కోసం శ్రమించినబోధన, బోధనేతర సిబ్బందికి అధ్యక్షులు జయలక్ష్మి, డైరెక్టర్ ప్రణీత్ అభినందనలు తెలిపారు.

## ఎన్ ఎస్ యూలో అద్వైత వేదాంతంపై చర్చాగోష్టి

**తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాత వార్త**



జాతీయ సంస్కృత వర్సిటీలో అద్వైత వేదాంత శాస్త్రంలోని శాస్త్రీయాంశాల పై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథులుగా సాధుశ్రీ భద్రేశదాస స్వామి విచ్చేసి దీప ప్రజ్వలనతో కార్యక్రమానికి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ భగవత్పాదాచార్యుల వాక్యార్థ సభలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబరచాలన్నారు.అద్వైత వేదాంత శాస్త్రంలోని శాస్త్రీయాలపై విశ్లేషణాత్మక చర్చతో విజ్ఞానం పొందే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో విభాగాధ్యక్షులు గణపతి భట్,దినేష్ పా, అధ్యాపకులు సతీశాచార్య,నాగరాజ భట్,మనోజ్ షిండే అంగద్,శ్రీహరి శివరాం, స్వామీజీలు,కంచి పరమాచార్య గురులు విద్యార్థులు,వర్సిటీ విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల హాస్టల్ వసతి పెంపునకు ఆదేశం

**తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త**



పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సీటు పొందిన విద్యార్థినులకు హాస్టల్ వసతి పెంచుతూ టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు.బుధవారం ఆయన ఎస్పీడబ్ల్యూ కళాశాలను ఆయన జేఈఓ వీరబ్రహ్మంతో కలసి పరిశీలించి ప్రిన్సిపాల్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో అత్యవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.కళాశాలలో విద్యార్థినుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని,విద్యార్థినులు ప్రాథమిక అవసరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను టిటిడి జేఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చారని, సమస్యలపై నివేదిక తయారు చేయాలని సూచించారు. విద్యార్థినులు చదువుకునేందుకు కళాశాల పరిసరాలు బాగున్నాయని,ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయికి మించి ఉందని అభినందించారు.ప్రధానంగా విద్యార్థుల హాస్టల్ సామర్థ్యాన్ని,వసతి సౌకర్యాన్ని పెంచాలని, వైద్య సౌకర్యాలు,వేడి నీటి కోసం సోలార్ వాటర్ హీటర్స్,ఈ లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటు,హాస్టల్లో మరమ్మతులు,ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం తదితర అంశాలపై అధికారులు నివేదిక తయారు చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి కాళాశాల పరిసరాలను, వంట గది,హాస్టల్ గదులను తనిఖీ చేసి విద్యార్థులు,తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బోర్డు మెంబర్ భానుప్రకాష్రెడ్డి, టీటీడీ డిఈవో వెంకట సునీల్,ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి,ఎస్ఈ మనోహరం అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి: ప్రిన్సిపాల్




**సత్యవేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త:**

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యాభ్యాసంలో ముందుకు సాగాలని తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెల్ అసోసియేషన్ రాష్ట్రజనరల్ సెక్రటరీ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదవగలిగితే భవిష్యత్ బంగారు బాట అవుతుందన్నారు. అయితే విద్యాభివృద్ధిలో అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే నిరంతర శ్రమ, పట్టుదల అవసరమన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, మ్యూజికల్ చైర్, కబడ్డీ, తదితర పోటీల్లో గెలుపొందిన 56 మంది విద్యార్థులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టేట్ జనరల్ సెక్రటరీ రవితో కలసి ప్రిన్సిపాల్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ క్రమంలో జేఎల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రవికి అధ్యాపక బృందంతో కలసి ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అనిల్‌కుమార్, రాజేష్, సురేష్, సలీం, అమీన్, దస్తగిరి, సుధీర్, గీత, కృష్ణవేణి, శివరాం, సుబ్రహ్మణ్యం, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## 15 వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిందే..!

**ఫుడ్ కమీషన్ సభ్యురాలు దేవి గింజిమాల**



**చంద్రగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** ప్రతి నెలా 1వ తారీఖు నుండి 15 వరకు రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సిందేనని ఫుడ్ కమీషన్ సభ్యురాలు దేవి గింజిమాల స్పష్టం చేశారు. మండల పరిధిలోని తొండవాడలో బుధవారం ఆమె రేషన్ (1028010) షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె లబ్దిదారులకు సరుకులు పంపిణీ చేస్తూ నెల నెలా సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, ధరలు ఏవిధంగా వసూలు చేస్తున్నారంటూ ఆరా తీశారు. చక్కెర కిలోకు రూ.17/-లు తీసుకుంటున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎం.డి.యు వాహనాలను తొలగించిన కూటమి ప్రభుత్వం పాత పద్ధతినే పునరుద్ధరించడంతో తనిఖీ ప్రాధాన్యతను సంతరించుకున్నది. రేషన్ పంపిణీపై లబ్దిదారులను సానుకూల స్పందన రావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడైనా రేషన్ పంపిణీపై ఫిర్యాదులు అందినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శేషాచల రాజు, సిఎస్‌డిటి సురేంద్ర, గోడౌన్ డిటి ప్రసాద్, డీలర్ చంద్రబాబు, అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## చెవిరెడ్డి ఆరోగ్యంగా ఉండాలని...

**జైలు నుండి క్షేమంగా తిరిగి రావాలని పూజలు**



**తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోగ్యంగా ఉండాలని...జైలు నుండి క్షేమంగా తిరిగి రావాలని తిరుపతిరూరల్ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆ కాంక్షించారు. ఈ మేరకు ఎల్ఎస్ నగర్‌లో ఉన్న చాముండేశ్వరి అమ్మవారికి 216 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. చెవిరెడ్డి అరెస్ట్ నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేసారు. ముందుగా చెవిరెడ్డి పేరిట అమ్మవారి గుడిలో అర్చన చేయించి, ప్రత్యేక పూజలు చేసారు. కూటమి ప్రభుత్వం కుట్రలతో చెవిరెడ్డి జైలుపాలు చేయడం దుర్మార్గమని, చాముండేశ్వరి దేవి భక్తుడైన చెవిరెడ్డికి అమ్మవారి దీవెనలు కలగాలని ఆకాంక్షించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2029లో అధికారంలోకి రావడం తథ్యమని జోస్యం చెప్పారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో వైసిపి కేడర్‌ను భయపెట్టలేరన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, ప్రధాన కార్యధర్శి అశోక్‌కుమార్‌రెడ్డి, వైసిపి బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి చిలమంద మునికృష్ణ వైసిపి చంద్రమౌళిరెడ్డి,చిన్ని యాదవ్, ఎంపిటిసి జైకర్, సుధా కర్‌రెడ్డి, కేశవులు, మొక్కల భారతి, తిమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, కరమల్లవల్లీ, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

## వాహనదారులకు నాణ్యమైన ఫ్యూయల్స్ అందించడమే ధ్యేయం

**– తనపల్లి రోడ్డులో ఇండియన్ పెట్రోల్ బంక్ ప్రారంభం**

**తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



వాహనదారులకు నాణ్యమైన ఫ్యూయల్స్ అందించడమే ధ్యేయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త సురేష్ డిస్టిలరీస్ అండ్ బేవరేజెస్ అధినేత రొమ్మాల రాజేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి–తనపల్లికి వెళ్ళే మార్గమధ్యలో వాహనదారుల సౌలభ్యం కోసం పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## వ్యవసాయ సహకారసంఘ అధ్యక్షుడిగా ఎం.జనార్ధనరాజు

**కార్వేటినగరం,ఆగస్టు 6 ప్రభాతవార్త:**



మండల వ్యవసాయ సహకారసంఘ అధ్యక్షుడిగా ఎం.జనార్ధనరాజు ఎన్నికయ్యారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, జి.డిజనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.వి.యం.థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జనార్ధనరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయి నుంచి మండలస్థాయి వరకు నేను చేసిన సేవలను గుర్తించి ఈ పదవి రావడం నాకు ఎంతో గర్వంగా వుందన్నారు. తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ కార్వేటినగరం సీనియర్ నాయకుడు,కృష్ణాపురం డ్యాం ఛైర్మన్‌గా,అమ్మపల్లి గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్ళు,కార్వేటినగరం మండల అధ్యక్షులుగా ఏడేళ్ళు, మండల ఎంపిపిగా మన పార్టీకి ఎనలేని సేవ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ భవనానికి అద్దె చెల్లించకపోతే తాళం వేస్తాం

**– భవన యజమాని హెచ్చరిక**

**కేవీబీ పురం, ఆగస్టు 6 ప్రభాతవార్త:**

మండలంలోని కండ్లూరు సచివాలయ భవనానికి గత ఐదేళ్లుగా బాడుగ చెల్లించకపోవడం శోచనీయమని, పలుమార్లు ఎంపీడీవోకి సంబంధిత అధికారులకు చెప్పినా ప్రయోజనం కరువైందని సచివాలయ భవన యజమాని డి.మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి సచివాలయం తాళం వేసేస్తానని, త్వరితగతిన అధికారులు జిల్లా నాయకులు, జిల్లా అధికారులు స్పందించి సచివాలయ భవనానికి బాడుగ చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవోకి మాధవరెడ్డి యజమాని తరపున వినతిపత్రం అందించారు. ఎంపీడీవో మాలతి వివరణ ఇస్తూ ప్రభుత్వం నుంచి బాడుగ డబ్బులు వస్తే వెంటనే చెల్లిస్తామని ఆమె తెలిపారు.

## చంద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే

**విజయపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



మండలంలోని పన్నూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నాలుగు కూడలి ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ వీరాభిమాని చంద్రయ్య చిత్రపటానికి బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రయ్య గుండెపోటుకు గురై ఇటీవల మృతి చెందారు. ఆయన కర్మక్రియలకు ఎమ్మెల్యే హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు చినబాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆలపాక గ్రామానికి చెందిన ఎల్.డిల్లీబాబుకు 43,400 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

## పడవేటమ్మ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే

**విజయపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



మండలంలోని కేవీపురం గ్రామంలో జరుగుతున్న పడవేటమ్మ అమ్మవారి జాతరలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి చినబాబు, అగరం రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బాబు నాయుడు, మాజీ ఎంపీపీ రాజేశ్వరి, వేణుగోపాల్ నాయుడు,టీడీపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమేష్‌రాజు, బాబు యాదవ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుడు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి రోజా

**పుత్తూరు రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



పుత్తూరు రూరల్‌మండలం ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వైసీపీ బూత్ కమిటీ మెంబరు రవి కుమారుడు ఇటీవల కాలంలో ఆకస్మిక మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి రోజా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె రవి చాలా ఆక్టివ్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారని, ఆయన పార్టీకి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులను తోడుగా ఉండి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మండల వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## వైసీపీ నేత కుటుంబానికి మాజీమంత్రి ఆర్థిక సాయం

**పుత్తూరు రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:**

మండలంలోని పరమేశ్వర మంగళం దళితవాడలో ఇటీవల అకాల మరణం పొందిన వైసీపీ కార్యకర్త సురేష్(చెంగారెడ్డి) కర్మక్రియలకు మాజీ మంత్రి రోజా ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందించారు. బుధవారం సురేష్ నివాసం వద్దకు వెళ్లి వైసీపీ నాయకులు భాస్కర్‌యాదవ్, వినోద్, నవీన్ యాదవ్‌లు మాజీ మంత్రి తరపున ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. పార్టీ తరపున తాము ఎప్పుడూ అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు.

## ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలి

**పుత్తూరు రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:**



పుత్తూరు డివిజన్‌లో ఉన్నటువంటి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వ రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలని, 10వ తరగతిలో వంద శాతం మార్కులు తెప్పించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాయాలని విద్యార్థులకు తెలియపరచాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి పరీక్షలో మంచి ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల విద్యా శాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు చెంగల్రాజు పాల్గొన్నారు.

## కోరం లేక వాయిదా పడిన మండల మీట్

**రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త**

రేణిగుంట మండల సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, మరో ఇద్దరు ఎంపీటీసీలు తప్ప మిగిలిన సభ్యులు హాజరు కాకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. పలువురు అధికారులు గైర్హాజర్ కావడం మరొక కారణం. అధికారులు హాజరు కాకపోవడం పట్ల కొంతమంది ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రిజిస్టర్లో సంతకం చేయలేదు. సంబంధిత శాఖల అధికారులు రాకపోతే సమస్యలు ఎలా చర్చించాలన్నది వారి వాదన. త్వరలో మరొక తేదీని ఖరారు చేసి సర్వసభ సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రభురావు తెలిపారు. సర్వసభ సమావేశం వాయిదా పడితే మండలంలో అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## సిద్ధమ్మకండ్రిగలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం



కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త : మండలంలోని సిద్ధమ్మకండ్రిగ గ్రామంలో బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్ర బాబు నాయుడు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలే ముందుకొచ్చి చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, జలీల్ అహ్మద్, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు, సిద్ధవరం సొసైటీ అధ్యక్షుడు పాదర్తి కోటేశ్వరరెడ్డి, నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## శ్రీ వెంకటేశ్వర స్వామి కుంభాభిషేకం



పెళ్లకూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : మండలంలోని రోశనూరు దళితవాడలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అంగ, రంగ వైభవంగా కుంబాభిషేకం మహోత్సవం నిర్వహించారు. కుంభాభిషే క మహోత్సవంలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ, పార్థసారథి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా రోసనూరు టిడిపి నేత దొమ్మరాజు సత్యంరాజు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ, పార్థసారథి దంపతులకు శాలువాలు కప్పి, సన్మానించి, పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ భూమి ఆక్రమణ తొలగింపు



గూడూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : రెండో పట్టణ పరిధిలోని పోలయ్య గుంట వద్ద కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానంకు చెందిన భూమిలో కొంతమంది ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం దేవాదాయ శాఖ అధికారులు అక్రమ నిర్మాణాల తొలగింపును చేపట్టారు. గూడూరు కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానంకు చెందిన భూమి రెండో పట్టణ పరిధిలోని పోలయ్య గుంట వద్ద ఉన్నది ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్నారు. తిరుపతి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, గూడూరు ఈఓ రవి కృష్ణ ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపును చేపట్టారు. ఏసీ మాట్లాడుతూ దేవాలయ భూమికి చెందిన ఆక్రమణలను తొలగిస్తున్నామని ఆక్రమణదారులందరూ దేవాలయ భూమిని ఖాళీ చేయాలని సూచించారు ఆక్రమణల తొలగింపులో దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అక్రమార్కులకు అడ్డాగా నాయుడుపేట



గ్రావెల్ తరలిస్తున్న భారీయంత్రాలు

నాయుడుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త : నెల్లూరు, తమిళనాడు, తిరుపతికి కేంద్ర బిందువైన నాయుడుపేటలో ఏదో ఒక ప్రాంతంలో రేషన్ బియ్యం, ఇసుక, గ్రావెల్, ఎర్రచందనం విలువైన ప్రకృతి సంపద యథేచ్చగా ఎల్లలు దాటుతున్నా పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. సూళ్ళూరుపేటకు చెందిన ఓ ముఠా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సేకరించిన రేషన్ బియ్యంను నాయుడుపేటలో నిల్వ చేసి అక్కడ నుండి రాత్రి సమయంలో లారీల ద్వార ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. నాయుడుపేట కేంద్రంగా గంజాయి, ఎర్రచందనం విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారు. గ్రామాల్లో యువత మత్తుపదర్ధాలకు అలవాటుపడి మహిళలపై దాడులకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా క్రికెట్ బెట్టింగులు, సింగిల్ నెంబర్ లాటరీలు నిర్వహిస్తున్నారు. దొరవారిసత్ర ం మండలం పూలతోట మిట్టలోని ప్రభుత్వ భూముల నుండి అధికారపార్టీకి చెందిన నాయకుడు గత మూడు నెలల నుండి రాత్రి సమయంలో భారీ యంత్రాలతో గ్రావెల్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు దోచేస్తున్నారు. భారీ యంత్రాలతో ఆనేపూడి- దొరవారి సత్రం, రోడ్డుపై గ్రావెల్‌ను అణునిత్యం తరలించడం వల్లన రోడ్డుపై పెద్దపెద్ద గుంటలు ఏర్పడి రోడ్డు రూపాన్ని కోల్పోతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాయుడుపేటలో జరుగుతున్న అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కాపులూరులో పొలం పిలుస్తోంది



నాయుడుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని కాలుపూరు, కూచివాడ గ్రామాల్లో వ్యవసాయశాఖ ఎడి నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం పొలం పిలు స్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ సాగుపై రైతులకు పలుసూచనలు, సలహాలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో నగదు జమకాని రైతులు తమపేర్లును ఆధార్ నంబర్‌తో సీడింగ్ చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ సహాయకులను కలిసి తమపేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎట గణేష్, విఏఏలు చెంగల్‌రాజు, భావన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే మండల కన్వీనర్ల ఎన్నిక

పెళ్లకూరు ఆగస్టు 6 ప్రభాత వార్త : తెలుగుదేశం పార్టీకి సంబంధించిన మండల కన్వీనర్లను గురువారం నాడు నాయుడుపేట పట్టణంలోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపం నందు ఉదయం ఎన్నుకోవడం జరుగుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. ఈ ఎన్నికల్లో బూత్ కన్వీనర్లు క్లస్టర్ ఇన్చార్జులు గ్రామ పార్టీ అధ్యక్షులు మండల జిల్లా మరియు రాష్ట్రస్థాయి వరకు వివిధ వాదాల్లో ఉన్న నాయకులు మరియు కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## వైజ్ఞానిక ప్రపంచంలో విద్యార్థులు జ్ఞాన సముపార్జనపై ఆసక్తి

### - సీతమ్స్‌లో నేషనల్ స్పేస్ డే కార్యక్రమంలో కలెక్టర్



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: నేటి వైజ్ఞానిక ప్రపంచంలో విద్యార్థులు జ్ఞాన సముపార్జనపై ఆసక్తి చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు సీతమ్స్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నేషనల్ స్పేస్ డే కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్ పాట్రా, షార్ జిఎం కృతివాసన్, కళాశాల ప్రిన్సిపల్ వెంకటచలపతి, కళాశాల కార్యదర్శి బద్రినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2023 సంవత్సరంలో చంద్రయాన్-3 విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా నేషనల్ స్పేస్ డే కార్యక్రమం జరుపుకుంటున్నా మన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 2 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొనను న్నారన్నారు. ప్రపంచం మొత్తం సాంతికేతమయం అయ్యిందని, వైజ్ఞానిక ప్రపంచడంలో ఇమడాలంటే విద్యార్థులు తరగతి గదుల్లో విద్యతో పాటు అదనంగా జ్ఞానంను సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులు 9వ తరగతి నుండే అదనంగా జ్ఞానం సంపాదించుకోవడానికి ఆసక్తి చూపాలన్నారు. అందుకు అవసరమైన సమాచారం పుస్తకాలతో పాటు ఇంటర్నెట్ ద్వారా తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబొరేటరీ సహకారంతో త్వరలో 50 రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనల గురించి తెలియని అంశాలను తెలుసు కోవడానికి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. షార్ జిఎం కృతివాసన్ మాట్లాడుతూ ఇటీవల జిఎస్ఎల్ఇ-ఎఫ్16 ప్రయోగం విజయవంతం అయ్యిందన్నారు. ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలిచిందని, రానున్న రోజుల్లో చంద్రయాన్-4 ప్రయోగానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో రాకెట్ లాంచింగ్, క్విజ్ ప్రోగ్రాం వుంటుందని ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని విజ్ఞానం సంపాదించుకోవాలన్నారు.

## చిల్లకూరులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



చిల్లకూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : చిల్లకూరు గ్రామంలోని మిక్సిడ్ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులుపాశిం సునీల్ కుమార్ ఆదేశాలు మేరకు పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభిరెడ్డి, చిల్లకూరు పిఏసిఎస్ అధ్యక్షులు కొండా రామచంద్రరెడ్డిల ఆధ్వర్యంలో నానాజీకి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన ఏడాది కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలు, నిర్వహించబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి రెడ్డి, చిల్లకూరు సొసైటీ ఛైర్మన్, యూనిట్ ఇన్చార్జ్ కొండా రామచంద్ర రెడ్డి, కో కన్వీనర్ దాసరి రాంప్రసాద్ యాదవ్, బెల్లంకొండ రాజేంద్ర, బూత్ కన్వీనర్ మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ సోమశేఖర్, బెల్లంకొండ మల్లి, టిఎన్ఎస్ఎఫ్ గూడూరు నియోజకవర్గ అధ్యక్షులు కాటూరు నవీన్ చంద్ర, గురువింద పూడి రవి, కోనేటి రవి, సచల బాబు, బీరదవోలు శ్రీనివాసులు, కోడి బాల రమణయ్య, జగదీష్, సుకుమార్, మురళి, శివ, పవన్, ఇతర నాయకులు కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే



వి.కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న రైతులకు సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వి.కోట, ముదరందొడ్డి సింగిల్‌విండో పాలకవర్గాల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వి.కోట పిఏసిఎస్ ఛైర్మన్‌గా నారాయణస్వామి, సభ్యులుగా జయప్ప, మూర్తి, ముదరందొడ్డి పిఏసిఎస్ ఛైర్మన్‌గా హరినాథ్‌రెడ్డి, సభ్యులుగా రాధాకృష్ణ, చిన్నబ్బ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకార బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు అందించి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇటీవలే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసిందన్నారు. సిఎం చంద్రబాబు పేర్కొన్న సూపర్ సిక్స్ పథకాలు ఆగస్టు15తో సూపర్ హిట్ కానున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం జగన్ నేతృత్వంలో రాష్ట్రాన్ని దివాళా తీయించిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుల పనులతో పాటు రాష్ట్రం కూటమి ప్రభుత్వ పాలనలో పరుగులు తీస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు రంగనాథ్, రాంబాబు, సోమశేఖర్, ధీరజ్, విశ్వనాథ్, మురుగేష్, శబరీష్, అమర్ పాల్గొన్నారు.

## పాసుపద అస్త్ర సాధనకై అర్జున తపస్మాన్



రామచంద్రాపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలోని ధర్మరాజుల వారి ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధల నడుమ అర్జున తపస్మాన్ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా పూజారి హరి ఆచ్చారి వేదమంత్రోచ్చారణల నడుమ తపస్మాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి, తపస్మాన్‌ను ప్రతిష్టింపజేశారు. అనంతరం అర్జునుడు పాసుపద అస్త్రం కోసం మెట్టుమెట్టుకు శివనామ స్మరణ చేస్తూ తపస్మాన్‌ను అధిరోహించారు. తపస్మాన్ నుండి విసిరే పూజా ప్రసాదం కొరకు మహిళలు, భక్తులు పెద్దఎత్తున పోటీపడ్డారు.

## శివయ్యసేవలో కర్నాటక హోం మంత్రి



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన కర్నాటక హోంశాఖ మంత్రి, ఎంఎల్‌సిలు బుధవారం వాయులింగేశ్వరుని సేవలో పాల్గొన్నారు. హోంశాఖ మంత్రి గంగాధరయ్య పరమేశ్వర, ఎంఎల్‌సి రామోజీ గౌడ కుటుంబ సభ్యులతో వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో ఇఓ బాపిరెడ్డి, ప్రోటోకాల్ ఎఇఓ మోహన్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామిఅ మ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును ఎఇఓ మోహన్, టెంపుల్ ఇన్సెపెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడు, ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## జిల్లా అటవీ శాఖాధికారిని కలిసిన ఎమ్మెల్యే



గూడూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : జిల్లా అటవీ శాఖ కార్యాలయం నందు జిల్లా అటవీ శాఖాధికారిని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కలిశారు. నియోజకవర్గంలో పలు సమస్యలు, తీర ప్రాంతాల నందు రోడ్డు వేయుటకు అటవీ శాఖ పరిధి కింద వచ్చే వాటికి అనుమతులు మంజూరు చేయాలని పేర్కొన్నారు.

## గజవాహనంపై శ్రీద్రౌపదీదేవి



పుత్తూరు రూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారు, అమ్మవారు గజ వాహనంపై ఊరేగించారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు, కార్వేటినగరం రోడ్డు మంచి నీళ్ళగుంట వద్ద గెరిగె ఉత్సవాన్ని మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగించారు. ఆ గెరిగెలోని జలాన్ని స్వామివారికి, అమ్మవారికి అభిషేకం చేశారు. ఉదయం, సాయంత్రం సమయంలో గెరిగె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే ఉదయం ఉత్సవం కార్యక్రమం గాండీవ సందోహం, రాజసూయ యాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి కాండవ దహనం కార్యక్రమం కూడా నిర్వహించారు. ఆలయ ఆవరణలో హరికథ మండపంలో హరికథ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పలు చోట్ల స్వామివారి, అమ్మవారి ప్లెక్సీ బోర్డులను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు.

**నేడు ఆలయంలో...**

శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు ఉత్సవం, మధ్యాహ్నం 3 గంటలకు ద్రౌపదికి శ్రీకృష్ణ పరమాత్మ కానుకగా నూతన వస్త్రాలు సమర్పణ సాయంత్రం 4 గంటలకు సైంధవ రథోత్సవం అనంతరం తవణం పల్లకి ఉత్సవం, రాత్రి హంస వాహనం, సింహ వాహనంపై, స్వామివారి, అమ్మవారు ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కోవిల్ కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి తెలిపారు.

## కళాశాలలో ఉచిత దంత వైద్య శిబిరం

గూడూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని డి.ఆర్. డబ్ల్యూ కళాశాలలో రోటరీ క్లబ్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం కళశాల యాజమాన్యం దంత వైద్యశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, కళాశాల సిబ్బంది, డాక్టర్ నారాయణలు పాల్గొన్నారు.

## రైతులకు జీలగలు పంపిణీ

వాకాడు, ఆగస్టు 6 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ స్కీం కింద వివిధ రకాల విత్తనాలను రైతులకు అగ్రికల్చర్ అధికారి దీప అందజేశారు. బుధవారం మండల కేంద్రమైన వాకాడు ఒకటవ సచివాలయంలోని ఏవో దీప మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశం మేరకు వాకాడు మండలంనకు వచ్చినటువంటి 400 క్వింటాల జీలగలను అర్హులైన రైతులకు అందచేశామన్నారు, జీలగలతో పాటు, నవధాన్యాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్నారన్నారు, మొదటి విడతలో వచ్చినటువంటి జీలగలు రైతులందరికీ అందించామని, మిగిలిన రైతులకు రెండవ దశలో కూడా జీలగలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ గ్రామ సహాయకులు దినేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాహుకేతుదోష నివారణ పూజల్లో సిక్కిం సిఎం



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను బుధవారం సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమంగ కుటుంబ సభ్యులతో కలసి జరిపించుకున్నారు. వారికి ప్రత్యేక పూజా టిక్కెట్లను కొనుగోలు చేసి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. పూజల తరువాత వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో ఎఇఓ మోహన్, టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి ఎస్ఓ నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## అగ్రిగోల్డ్ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవు



దొరవారిసత్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని అక్కర పాక గ్రామ సమీపంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను బుధవారం తిరుపతి సిఐడి డి.ఎస్.పి పద్మలత ఆదేశాల మేరకు సీఐ రంగస్వామి రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. తిరుపతి సిఐడి అటాచ్ మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను ఎవ్వరైనా ఆక్రమించినా, సాగుచేసిన ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. అక్కరపాక గ్రామంలో సుమారు 108 ఎకరాలు అగ్రిగోల్డ్ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయన్నారు. కొందరు అగ్రిగోల్డ్ భూములను దున్నుతున్నారని ఫిర్యాదులు అందాయి. వీరుతో పాటు సిఐడి ఎస్సై ధరణిధర్ వీఆర్వో జ్ఞానేంద్ర, తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా భవాని ప్రసాద్



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా భవాని ప్రసాద్‌ను నియమిస్తూ డిఎంఎ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఈ నేపధ్యంలో సుమారు 2 నెలలుగా ఖాళీగా ఉన్న శ్రీకాళహస్తి కమిషనర్ పోస్టులో డిఎంఎ కార్యాలయంలో పని చేస్తున్న భవాని ప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. భవాని ప్రసాద్ గతంలో మదనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పని చేసారు.

## సంస్కరణలకు శ్రీకారం

### టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు మెమొంటో



తిరుమల, ఆగస్టు 6ప్రభాతవార్తప్రతినిధి: విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు చొరవ చూపారు. దీనికి నిదర్శనంగా బుధవారం ఉదయం పద్మావతి మహిళ జూనియర్ కళాశాలకు విచ్చేసిన నాయుడుకు జెఈఓ వీరబ్రహ్మం ,టిటిడి డిఈఓ వెంకటసునీల్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

## పార్టీని బలోపేతం చేద్దాం : కోలా పిలుపు



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఈనెల 12న సారధ్య బహిరంగ సభను విజయవతం చేయటానికి ప్రతి బిజెపి కుటుంబసభ్యుడు కృషి చేయాలని బుధవారం జరిగిన నియోజకవర్గ సమావేశంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ పిలుపు నిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడుగా పివి మాధవ్ ఎన్నికై మొదటి సారి తిరుపతి జిల్లాకు వస్తున్న సందర్భంగా తిరుపతిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని, దానిని విజయవంతం చేయటానికి పట్టుదలగా పని చేయాలని కోలా ఆనంద్ పిలుపు నిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి అధ్యక్షతన పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 11 సంవత్సరాల పరిపాలనలో ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర అభివృద్ధికి ఇతోధిక సహాయాన్ని అందిస్తున్నారన్నారు. ఈ సభలో రాష్ట్ర సభ్యురాలు కండ్రిగ ఉమ, బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షుడు బి.చంద్రప్ప, బిడి బాలాజి, కొండేటి గోపాల్, మండలాధ్యక్షులు నాదమునిరెడ్డి, ఎంవియస్ ప్రసాద్, వేదాం కృష్ణయ్య, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, ఆర్ హరీష్‌రెడ్డి, తిరుమలశెట్టి హరీష్ తదితరులు ప్రసంగించారు. నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## తొండమాన్‌పురంలో పవిత్రోత్సవాలు



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: టిటిడికి అనుబంధంగా వెలసిన తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం సంప్రదాయబద్ధంగా పవిత్రంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణతో ప్రారంభమై పూర్ణాహుతితో ముగిసే ఉత్సవాలను బుధవారం అంకురార్పణ జరిగింది. ప్రతి ఏడాది పవిత్రోత్సవాలను భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు. ఏడాదిలో తెలిసి తెలియక జరిగే తప్పిదాలకు నివృత్తిగా పవిత్రోత్సవాలను నిర్వహించే సంప్రదాయం ఉంది. ఈ నేపధ్యంలోనే తొండమాన్ చక్రవర్తిచే నిర్మించిన ఆలయంలో పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించటం ఆనవాయితి. ఉదయం నుంచి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు బాబుస్వామి, జయస్వామి, గోపి స్వామి, కృష్ణస్వామిల సారథ్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో గురు వారం పవిత్ర ప్రతిష్ట, శుక్రవారం పవిత్రాల సమర్పణ, శనివారం చక్రస్నానం, పవిత్ర విసర్జన, పూర్ణాహుతితో ముగుస్తుందని నిర్వాహకులు వివరించారు.

## వేదాం పాఠశాల మార్పుపై ఆందోళన



శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం వేదాం గ్రామానికి చెందిన ప్రజలు బుధవారం ఎంఇఓ కార్యాలయం వద్ద ధర్నా చేసారు. పాఠశాల విలీనంకు సంబంధించి తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంతో కాలంగా నిర్వహించబడుతున్న పాఠశాలనుకాదని చిన్న పాఠశాలలో విలీనం చేయటంను వ్యతిరేకిస్తూ ఆది నుంచి గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపధ్యంలో మొదట పాఠశాలకు ముళ్ళకంప వేసారు. తరువాత బీగాలు తగిలించారు. కాగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్ళి ఆందోళన చేసారు. అంతేకాకుండా అన్నదాత సుఖీభవ కార్యక్రమాలకు హజరైన జిల్లా కలెక్టర్, శాసన సభ్యుడునికి వినతి పత్రాలు అందించారు. వేదాం గ్రామంలో 50 మంది విద్యార్థులున్నారు. బిడ్డల చదువులు సాగాలంటే పాఠశాలను కొనసా గించాలని కోరారు. అయితే గ్రామస్తులు ధర్నాచేస్తారని తెలుసుకున్న విద్యాశాకాధికారులు పలాయనం చిత్తగించటం తగదని ధ్వజమెత్తారు. తమ బిడ్డల చదువులు కొనసాగటానికి జిల్లా అధికారులు, స్థానిక నాయకులు చొరవ చూపి పాత పాఠశాలను కొనసాగించాలని కోరారు.

## డిజిపిని కలిసిన తుడ ఛైర్మన్‌దివాకర్‌రెడ్డి



తిరుపతికార్పొరేషన్, ఆగస్ట్ 6ప్రభాతవార్త : తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి బుధవారం అమరావతిలో డిజిపి హరీష్‌కుమార్ గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపిని దుశ్శాలువతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు.

## ఘాట్‌లో తప్పిన పెనుప్రమాదం



తిరుమల, ఆగస్ట్ 6ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతికి వెళ్ళే మొదటిఘాట్‌లో 28వ మలుపు వద్ద బుధవారం మధ్యాహ్నం పెద్దప్రమాదం తప్పింది. ఆర్టీసి బస్సు క్రిందకు ద్విచక్రవాహనం దూరిపోవడంతో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించంతో ప్రాణాలు కాపాడారు.